సాక్షి
అనకాపల్లి
7
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025


సంఘటన స్థలంలో భీతావహ దృశ్యం

ప్రమాదంలో మృతులు

1. దాడి రామలక్ష్మి (35), రాజుపేట
2. పురం పాప (40), కైలాసపట్నం
3. గుప్పిన వేణుబాబు (34), కైలాసపట్నం
4. సంగరాతి గోవిందు (40), కైలాసపట్నం
5. సేనాపతి పైడితల్లినాయుడు అలియాస్ బాబూరావు (60), చౌడువాడ
6. అప్పికొండ తాతబాబు అలియాస్ పల్లయ్య (50), కైలాసపట్నం
7. దేవర నిర్మల (38), వేట్లపాలెం
8. హేమంత్ మనోహర్ (20), భీమిలి

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

1. జల్లూరు నాగరాజు(50), రాట్నాలపాలెం
2. సియాద్రి గోవింద్(38), కైలాసపట్నం
3. వేలంగి సంతోషి (44), సామర్లకోట
4. వేలంగి సారోని(19), సామర్లకోట
5. మడగల జానకీరామ్(55), కైలాసపట్నం

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారు...

1. గంపెన సూరిబాబు(40), కైలాసపట్నం
2. సంగరాతి శ్రీను(35), కైలాసపట్నం
3. వేలంగి రాజు (19), సామర్ల కోట)

ఆదివారం మిట్ట మధ్యాహ్నం 12:30 గంటల సమయం..ఒకవైపు మండుతున్న సూర్యుడి భగభగలు..మరోవైపు సెగలు కక్కుతున్న వాతావరణంలో పనిచేస్తున్న కార్మికులు...ఊపిరి సలపని పని...కడుపు ఆకలితో నకనకలాడుతోంది... కాసేపట్లో పని చాలించి ఓ ముద్ద తిని వద్దాం..అనుకుంటుండగా..ఒక్కసారిగా భూమి దద్దరిల్లిన శబ్దం. దిక్కులు పిక్కటిల్లేలా కార్మికుల హాహాకారాలు... క్షణకాలంలో తునాతునకలైన దేహాలు...పూర్తిగా కాలిపోయిన శరీరాలు.... కాలిన గాయాలతో బాధితుల పెడబొబ్బలు... ఒక్కసారిగా భీతిగొలిపే దృశ్యాలతో ఆ ప్రాంతం రక్తకాసారంగా మారిపోయింది. ఏం జరిగిందో తెలిసేలోగానే ఎనిమిది మంది అక్కడికక్కడే బుగ్గయిపోయారు... మరో ఎనిమిది మంది క్షతగాత్రులుగా మారిపోయారు...కోటవురట్ల మండలం కైలాసపట్నం సమీపంలోని విజయలక్ష్మి **ఫైర్ వర్క్స్‌లో సంభవించిన ఘోరప్రమాదం దృశ్యమిది...**

పగిలిన గుండెలు...

బాణసంచా కేంద్రంలో బతుకులు బుగ్గి ■ కైలాసపట్నంలో ఘోర విషాదం

- **మధ్యాహ్నం 12.30 గంటలకు భారీగా పేలుడు**
- **ఎనిమిది మంది దుర్మరణం, మరో ఎనిమిది మందికి గాయాలు**
- **ఇద్దరి పరిస్థితి విషమం**
- **ప్రమాద సమయంలో కేంద్రంలో 16 మంది కార్మికులు**
- విశాఖపట్నం, నర్సీపట్నం ఆస్పత్రులకు క్షతగాత్రుల తరలింపు
- పదేళ్ల క్రితం గోకులపాడులో ఇదే పరిశ్రమలో ప్రమాదం
- ఆ ఘటనలో ఎనిమిది మంది దుర్మరణం
- మళ్లీ దశాబ్దం తరువాత అదే ఘోర కలి
- భద్రతా తనిఖీల్లో లోపం...కార్మికులకు శాపం

ఆదివారం సెలవయినా డ్యూటీకి వెళ్లి...



ఆదివారం డ్యూటీకి సెలవు. అయినా పనులు ఉన్నాయని చెప్పడంతో నా భర్త డ్యూటీకి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసినా తిరిగి వెంటనే డ్యూటీకి వెళ్లారు. అక్కడ ఏమయ్యిందో తెలియదు కానీ పెద్ద శబ్దం రావడంతో భయపడ్డాము. ఆ తర్వాత కొద్ది సేపటికి ఫోన్ వచ్చింది. ఈ ప్రమాదంలో నా భర్త గోవిందు గాయపడ్డారని ఫోన్‌లో చెప్పారు. పరుగెత్తి కంపెనీ వద్దకు చేరుకున్నాము. అక్కడ పరిస్థితి చూస్తే చాలా భయం వేసింది. కొన్ని మృతదేహాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. నా భర్త ఎక్కడ ఉన్నాడా అని వెతికాను. చివరకు కనిపించారు. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొని వెళ్లాము. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు పంపారు. **–సియ్యాద్రి వరలక్ష్మి**, గోవిందు భార్య, కైలాసపట్నం

కొంపముంచిన పండగ ఆర్డర్

గ్రామాల్లో వివిధ పండుగలు ఉన్నాయి. బాణసంచా సామగ్రి కావాలి అని ఆర్డర్ వచ్చింది. దీంతో రేయింబవళ్లు పనిచేస్తున్నారు. సెలవయినా ఆదివారం కూడా పనిచేశారు. పని ఒత్తిడిలో నిప్పు రవ్వలు వచ్చినా ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. ఈ రవ్వల వల్ల పేలుడు జరిగి ఉండవచ్చు. ఈ సంఘటనలో బాణసంచా కంపెనీ యాజమాని కూడా గాయపడ్డారు.



–అప్పారావు,
నాగరాజు మేనల్లుడు,
కైలాసపట్నం

ప్రమాద స్థలంలో భీతావహ దృశ్యాలు...

ఘటన సమయంలో మందుగుండు సామగ్రి దంచుతున్న హేమంత్ మనోహర్ అనే వ్యక్తి తునాతునకలయ్యాడు. భారీ పేలుడుకు తల, కుడి చేయి ఎగిరిపోయినట్టు తెలుస్తోంది. మిగిలిన ఏడుగురు శరీరాలు పూర్తిగా కాలిపోయి విగతజీవులుగా కనిపించారు. ఇక గాయపడిన 8 మందిలో నాగరాజు (52)కు 90 శాతం కాలిన గాయాలతో, జానకీరాంకు 60 శాతం కాలిన గాయాలతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.


సంతోషిని కేజీహెచ్ వార్డులోకి తరలిస్తున్న సిబ్బంది

ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు, పోలీసులు గాయపడ్డ బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. విషమంగా ఉన్న వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మైనర్ గాయాలతో ఉన్న వారికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ఘటనా స్థలానికి కలెక్టర్..

ప్రమాదం జరిగిన గంటన్నర వ్యవధిలోనే జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానిక కోటవురట్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రి చేరుకుని చికిత్స పొందుతున్న వారిని వెంటనే విశాఖపట్నం కేజీహెచ్, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేసి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రుల బంధువులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కలెక్టర్ సంఘటన స్థలానికి చేరుకుని పేలుడుకు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కూలి డబ్బుల కోసం వెళ్లి..

ప్రతిరోజూ అక్కడ 20 నుంచి 30 మంది వరకు కార్మికులు పనిచేస్తారు. బాణసంచా కేంద్రంలో ప్రమాద ఘటన జరిగే సమయానికి 16 మంది మాత్రం ఉన్నారు. లేదంటే అపార ప్రాణ నష్టం జరిగి ఉండేదని అధికారులు చెబుతున్నారు. వచ్చే మంగళవారం కోటవురట్ల మండలంలో అన్నవరం, చౌడువాడ, పందూరు గ్రామాల్లో గ్రామ జాతర ఉత్సవాలు ఉండడంతో బాణసంచా ఆర్డర్లు ఎక్కువగా వచ్చాయి. దీంతో గత వారం రోజులుగా పని ఎక్కువగా చేస్తున్నారు. అయితే ఆదివారం కావడంతో అక్కడ పనిచేసే సామర్లకోటకు చెందిన ఒక కుటుంబం సంతకు వెళ్లేందుకు ఓనర్ నుంచి డబ్బులు తీసుకోవడానికి మాత్రమే వచ్చారు. దీంతో అక్కడ పనిచేసే 11 మందితో పాటు ఈ అయిదుగురూ ప్రమాదంలో గాయపడ్డారు.


ప్రమాద ఘటనపై చర్చిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా


కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

పనికెళ్లిన నాలుగు రోజులకే..

బాణసంచా కేంద్రంలో ప్రమాదంలో హేమంత్ మృతి


హేమంత్ మనోహర్

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మీపురానికి చెందిన మెడిసి హేమంత్(24) ఇటీవల బాణసంచా తయారీ నేర్చుకున్నాడు. తెలిసిన వారి ద్వారా నాలుగు క్రితం కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా కేంద్రంలో పనికి వెళ్లాడు. బాణసంచా కేంద్రంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో అశువులుబాశాడు. అతని తండ్రి మెడిసి సత్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. తల్లి లేరు. అక్క స్వర్ణకల ఉన్నారు. తన కొడుకు ఇంటికి ఆధారంగా ఉంటాడని భావించామని.. త్వరలో వివాహం కూడా చేయాలని అనుకున్నామని.. ఇంతలో ఘోరం జరిగిపోయిందని తండ్రి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. అందరితో సరదాగా ఉండే హేమంత్ ఇకలేడన్న విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు విషాదం మునిగిపోయారు.


విషణ్ణ వదంతో తండ్రి సత్యనారాయణ, బంధువులు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సాక్షి, అనకాపల్లి/కోటవురట్ల :

పొట్టకూటి కోసం మందుగుండు సామగ్రి తయారు చేసేందుకు వెళ్లిన పలువురు కార్మికులు ఆ మందుగుండుకే ఆహుతయ్యారు. బాణసంచా కేంద్రంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం పేద కార్మిక కుటుంబాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. మరి కొందరు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం జరిగిన విస్ఫోటనం ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలను మింగేసింది. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. మిట్ట మధ్యాహ్నం కావడంతో గ్రామస్తులంతా ఇళ్లలో సేదతీరుతున్న సమయంలో ఒక్కసారిగా భూమి కంపించి అగ్ని ప్రకంపనలు సృష్టించినట్టుగా చుట్టూ పొగ, మంటలు కనిపించాయి. గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో గల బాణసంచా కేంద్రంలో సంభవించిన పేలుడు ధాటికి గ్రామస్తులు భీతావహులయ్యారు. మంటలు ఎగిసిపడుతుంటే ఆవైపు వెళ్లాలంటే భయం..మరో వైపు క్షతగాత్రుల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. దీంతో ఫైర్ ఇంజన్, 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు.

ప్రమాదం జరిగిందిలా...

కైలాసపట్నం గ్రామానికి చెందిన మడగల జానకీరాం తన తోడల్లుడు అప్పికొండ తాతబ్బాయి పేరున 'విజయలక్ష్మి ఫైర్‌వర్క్స్' మందుగుండు తయారీకి లైసెన్సు తీసుకుని 20 ఏళ్లుగా మందుగుండు తయారీ కేంద్రాన్ని నడుపుతున్నాడు. లైసెన్స్‌కు వచ్చే ఏడాది 2026 వరకూ గడువు ఉంది. దీపావళి పండగతో పాటు సమీప మండలాల్లో పల్లెల్లో జరిగే గ్రామ పండుగలకు వచ్చే ఆర్డర్లపై మందుగుండు సామగ్రిని తయారు చేస్తారు. కొత్త అమావాస్య నుంచి వరుసగా పల్లెల్లో పండగలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్డర్లు ఎక్కువగా వచ్చాయి. వర్క్‌లోడ్ ఎక్కువగా ఉండడంతో కార్మికులు ఒత్తిడితో పనిచేస్తున్నారు. సరిగ్గా 12.30 గంటల సమయంలో ఓ కార్మికుడు మందును దంచుతుండగా ఒక్కసారిగా విస్ఫోటనం సంభవించింది. వారం రోజులుగా తయారు చేసిన మందుగుండు సామగ్రి మొత్తం అక్కడే ఉండడంతో ఒక్కొక్కటిగా క్షణాల్లో అంటుకుపోయాయి. పక్కనే ఉన్న పౌడర్‌పై అగ్ని రేణువులు తూలి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పనిచేస్తున్న కార్మికులు తేరుకుని తప్పించుకునే అవకాశం కూడా లేకపోవడంతో తీవ్రంగా కాలిపోయి 8 మంది కార్మికులు అక్కడికక్కడే మాడి మసైపోయారు. విస్ఫోటనం ధాటికి అక్కడ ఉన్న రేకుల షెడ్లు, రెండు చిన్న స్లాబ్ గదులు చెల్లా చెదురయ్యాయి. భూమి కంపించినట్టయి..పెద్దగా మంట రావడంతో గ్రామస్థులంతా అదిరిపడి ఒక్కసారిగా పరుగున వచ్చారు. వరహాలు అనే గ్రామస్తుడు ఫైర్ ఇంజిన్, 108కి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నర్సీపట్నం, నక్కపల్లి, కోటవురట్ల, ప్రభుత్వ ఆస్పత్రి 108 వాహనాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి.సమీప నక్కపల్లి, నర్సీపట్నం, యలమంచిలి నుంచి మూడు ఫైర్ ఇంజిన్‌లు వచ్చాయి. మంటలు అదుపు చేయడానికి సుమారు 4 గంటల పాటు సమయం పట్టింది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

ఎంవీపీకాలనీ (విశాఖ)/కోటవురట్ల: కైలాసపట్నం బాణసంచా తయారీ కేంద్రం పేలుడు ఘటన అత్యంత దురదృష్టకరమని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆదివారం రాత్రి ఆమె ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఘటనలో మృతి చెందిన వారంతా ఐదేళ్లుగా ఆ బాణసంచా కేంద్రంలో పనిచేస్తున్నారన్నారు. 2026 వరకు ఆ కేంద్రానికి లైసెన్స్ ఉందన్నారు. పేలుడు పదార్థం చేజారడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విషయం ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఘటన సమయంలో అక్కడ ఉన్న 16 మందిలో 8 మంది మృతి చెందగా 8 మంది గాయపడ్డారన్నారు. గాయపడిన వారిలో ఐదుగురికి కేజీహెచ్‌లోను, ముగ్గురికి నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలోను మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనలో మృతి చెందిన 8 మందికి ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించినట్లు తెలిపారు. మరో రూ.2 లక్షలు కేంద్రం నుంచి కూడా మంజూరవుతుందన్నారు. క్షతగాత్రులకు రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఆమె వెంట కలెక్టర్ హరింద్రప్రసాద్, కేజీహెచ్ ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ఉన్నారు.


కేజీహెచ్‌కు చేరుకున్న హోం మంత్రి అనిత, ఎంపీ రమేష్

పొట్టకూటికి ప్రమాదకర పనిలో...

మృతుల్లో మామా, అల్లుడు
ప్రాణాపాయస్థితిలో మరో అల్లుడు

కోటవురట్ల: ప్రమాద ఘటనలో మృతులంతా రెక్కాడితే కాని డొక్కాడని వారే కావడంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కైలాసపట్నానికి చెందిన సంగరాతి గోవిందుకు ఇద్దరు పిల్లలు కాగా పాప ఇంటర్, బాబు 9వ తరగతి చదువుతున్నారు. పిల్లలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వాలని ఆలోచనతో గోవిందు స్థానికంగా ఉన్న మందుగుండు తయారీ కేంద్రానికి నాలుగేళ్లుగా పనికెళుతున్నాడు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్యా పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరో మృతురాలు పురం పాప మూడేళ్లుగా ఇందులో పనిచేస్తోంది. ప్రమాదమని తెలిసినా కుటుంబానికి వేరే ఆధారం లేక పని కెళ్లి అనంతలోకాలకు పోయింది. మరో మృతుడు గుంపిన వేణుబాబు నిరుపేద కుటుంబానికి చెందినవాడు. ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. పనికి వెళ్లకపోతే ఆ రోజు పస్తులే. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరో మృతుడు అప్పికొండ తాతబ్బాయి కాగా ఇతని పేరునే విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ లైసెన్సు ఉంది. ఇతని తోడల్లుడు మడగల జానకీరాం ఈ ఫైర్ వర్క్స్‌ను నడుపుతుండగా తోడల్లుడికి సాయంగా ఇందులో పని చేస్తున్నాడు. చౌడువాడకు చెందిన శానాపతి బాబూరావు ఫైర్ వర్క్స్ యజమాని మడగల జానకీరాంకు మావ అవుతారు. అల్లుడికి సాయంగా ఉండడం కోసం ప్రతి రోజు ఉదయాన్నే చౌడువాడ నుంచి వచ్చి పనిచేస్తూ ఉంటారు. ఈ ప్రమాదంలో ఇతనితో పాటు ఇతని పెద్దల్లుడు, స్వయాన బావమరిది అయిన అప్పికొండ తాతబ్బాయి కూడా మృతి చెందడంతో ఈ కుటుంబంలో పెద్ద విషాదాన్ని నింపింది. మామా అల్లుళ్లు ఇద్దరూ మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇక మరో అల్లుడు ఫైర్ వర్క్స్ యజమాని అయిన మడగల జానికీరాం కూడా దాదాపు 40 శాతం కాలిపోవడంతో ప్రమాద స్థితిలో విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.



దాడి రామలక్ష్మి (ఫైల్), శానాపతి బాబూరావు(ఫైల్)


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు జోగులు, ధర్మశ్రీ, గణేష్

పాడేరు ఘాట్‌లో వాహనం బోల్తా

- 15 మందికి గాయాలు
- 'ఫైర్' అధికారుల తక్షణ స్పందనతో తప్పిన ప్రాణాపాయం


ప్రమాదానికి కారణమైన వాహనం


క్షతగాత్రులను ఫైర్ వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది


మాడుగుల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మాడుగుల: పాడేరు రోడ్డులో ఏసుప్రభువు విగ్రహం టర్నింగ్ పాయింట్ వద్ద ఆదివారం తెల్లవారు 3 గంటల సమయంలో బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలయ్యాయి. అయితే ఫైర్ అధికారులు వెంటనే స్పందించి బోల్తా పడిన వాహనాన్ని తప్పించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడంతో ప్రాణనష్టం జరగలేదు. స్థానిక ఫైర్ స్టేషన్ అధికారి రాజేశ్వరరావు కథనం ప్రకారం.. వీరంతా ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా కొడవలస, సీతమామిడి గ్రామాల నుంచి తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట వలస వెళ్తున్నారు. దీంతో వాహనం అదుపు తప్పడంతో వీరికి గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ నుంచి క్షతగాత్రులను తమ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి తీవ్రంగా గాయాలైన ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

అప్పన్నకు శ్రీ పుష్పయాగం


శ్రీపుష్పయాగాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం నుంచి స్వామికి శ్రీ పుష్పయాగాన్ని నిర్వహించారు. స్వామి కల్యాణ ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పూల అలంకరణ చేసి ఆలయ కల్యాణమండపంలో శేషతల్పంపై ఆళ్వారులతో సహా వేంజేపచేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ద్వాదశి ఆరాధనలు, పలు రకాల పుష్పాలతో పుష్పాంజలి సేవ చేశారు.

ఇంటర్ టాపర్స్‌కు సత్కారాలు

కశింకోట/రోలుగుంట: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన ఇద్దరు విద్యార్థినులకు అరుదైన గౌరవం లభిస్తోంది. కశింకోట మండలం తేగాడ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదివి బైపీసీలో 983/1000 మార్కులు తెచ్చుకున్న కంట్రెడ్డి రాజులమ్మ సన్‌షైన్ స్టార్స్ పురస్కారానికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ తెలిపారు.ఈ నెల 15న విజయవాడలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నట్లు చెప్పారు. ఆమెతోపాటు ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అభినందనలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు, అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఆర్. జయప్రకాష్‌లు కూడా అభినందించారు. ఎంపీసీ గ్రూపు నుంచి 986 మార్కులు తెచ్చుకొని ఉమ్మడి విశాఖ జిల్లా టాపర్‌గా నిలిచిన రోలుగుంట మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మడ్డు గౌతమి కూడా ఈ నెల 15న అమరావతిలో జరగనున్న టాపర్స్ సత్కార్‌కు ఎంపికైంది. తల్లిదండ్రులతో కలిసి రావాలని ఇంటర్ బోర్డు కమిషన్ కార్యాలయం నుంచి ఆదివారం ఆహ్వానం అందింది. కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు, గణిత అధ్యాపకుడు సీనియర్ లెక్చరర్ సహదేవుడు ఆమెను అభినందించారు.


గౌతమి


రాజులమ్మ

మృతులకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలి

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మహారాణిపేట: కైలాసపట్నంలో బాణసంచా ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. క్షతగాత్రులకు ప్రమాద తీవ్రతను బట్టి రూ.10 నుంచి రూ.25 లక్షలు అందించాలన్నారు.

క్షతగాత్రులకు కంబాల పరామర్శ



కోటవురట్ల ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి: కైలాసపట్నంలో బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాద స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, పార్టీ నాయకులు దత్తుడు సీతబాబు, ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, పార్టీ అధ్యక్షుడు శ్రీను, తదితరులు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. జరిగిన ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలతో పాటు క్షతగాత్రులను తక్షణమే ఆదుకోవాలని జోగులు డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందించాలన్నారు. ప్రమాద తీవ్రత విషయాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

అనకాపల్లి: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. ఒక్కొక్కరికి కోటి రూపాయాలు నష్టపరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తరచూ పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమైనట్లు పేర్కొన్నారు.

నాటి ఘోరకలి... మళ్లీ...!

- 2015 మార్చిలో గోకులపాడులో ఘటన
- బాణాసంచా కేంద్రంలో పేలుడు
- నాడు ఎనిమిది మంది మృత్యువాత



అనాథలైన మృతుల కుటుంబీకులు(ఫైల్)



పదేళ్ల క్రితం గోకులపాడు బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడిన వారు (ఫైల్)

నక్కపల్లి: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆదివారం బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన బారీ ప్రమాదం తరహాలోనే పదేళ్ల క్రితం ఎస్.రాయవరం మండలంలో గోకులపాడులో జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో బాణసంచా కేంద్రాల్లో ప్రమాదం సంభవించి ఎక్కువ మంది మృత్యువాత పడిన ఘటన ఇది రెండోదిగా చెప్పుకోవచ్చు. జాతీయర హదారికి కూత వేటు దూరంలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదశాత్తూ పేలుడు సంభవించి ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. బాణసంచా తయారీ చేస్తుండగా పేలుడు సంభవించడంతో నూతి సత్యవతి, లింగంపల్లి శేషమ్మ, భూపతి సత్యనారాయణ, లింగంపల్లి లోవరాజు, సమ్మంగి రమణ, కేదారి దుర్గ... అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వీరి మృతదేహాలు తునాతునకలయ్యాయి. ఒక మహిళ శరీర భాగాలు తెగి పడి చెట్లకు వేలాడడం స్థానికులను కలిచి వేసింది. ఘటనా స్థలంలో చనిపోయిన ఆరుగురు కాకుండా గాయపడిన వారిలో ఇద్దరు తర్వాత చికిత్స పొందుతూ మరణించారు. ఈ దుర్ఘటనలో మనుషులే కాదు, సమీపంలో మేతకోసం వచ్చిన కోళ్లు, కార్మికుల సైకిళ్లు, మొబైల్‌ఫోన్లు, ఇతర పరికరాలు సైతం కాలిబూడిదయ్యాయి. అదృష్టవశాత్తూ చుట్టుపక్కల నివసించే ఇళ్లకు ఏమీ కాలేదు. ఇదే ప్రమాదంలో గాయపడినవారిలో అడ్డురోడ్డుకు చెందిన ఆడారి కృష్ణ, సోముదేవుపల్లికి చెందిన కె.విశ్వనాథం, పాయకరావుపేటకు చెందిన బంగారి అప్పారావు, గోకులపాడుకు చెందిన నానేపల్లి దుర్గ, శీలంశెట్టి లక్ష్మి ఉన్నారు.

కొద్ది నిమిషాల్లో ఇంటికి వెళ్లే సమయంలో..

కొద్దినిమిషాల్లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లిపోయే సమయంలో ప్రమాదం సంభవించింది. ప్రమాదం దాటికి పేలుడు పదార్థాలు కిలోమీటరు దూరంలో పడ్డాయి. తయారీ కేంద్రంలో మంటలు వ్యాపించడంతో ఒక కార్మికుడు భయంతో పరుగెత్తి సమీపంలో బావిలో పడిపోయాడు. ఇతని ఆచూకీ నాలుగు రోజుల తర్వాత తెలిసింది. నేవీ ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆ మృతదేహాన్ని వెలికితీసారు. గోకులపాడులో పేలుడు సంభవించిన కంపెనీలో బాలకార్మికులు పనిచేస్తున్నట్టు గుర్తించారు. వారిలో కేదారి దుర్గ(12) మృత్యువాతపడగా, కె.విశ్వనాథం (13) నానేపల్లి దుర్గ (12) గాయపడ్డారు. నాడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.2లక్షల చొప్పున మాత్రమే సాయం అందజేసింది. నాటి హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఘటన జరిగిన మరుసటి రోజున నష్టపరిహారం అందజేశారు. ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.50 వేల చొప్పున సాయం అందించారు. కేంద్రం వద్ద స్టౌలు, మండే పదార్థాలు, వంటపాత్రలు కనిపించాయి. అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులు తనిఖీలు సరిగ్గా చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని అప్పటి అధికారులు తెలిపారు. అదే ఏడాది రాంబిల్లిలోని బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో కూడా ముగ్గురు మృత్యువాత పడ్డారు.

కేజీహెచ్‌లో ఐదుగురు క్షతగాత్రులు..

ఇద్దరి పరిస్థితి విషమం

మహారాణిపేట (విశాఖ): కోటవురట్ల మండం కైలాసపట్నం ప్రమాదంలో గాయాలైన క్షతగాత్రులను ఆదివారం సాయంత్రం కేజీహెచ్‌కు తీసుకొని వచ్చారు. ఐదుగురిని ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చేర్పించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో ప్లాస్టిక్ సర్జరీ వార్డు విభాగాధిపతి డాక్టర్ పి.మోహనరావు క్షతగాత్రులకు చికిత్స అందించారు. జల్లూరు నాగరాజు, వేలంగి సంతోషి, సియాద్రి గోవింద్, వేలంగి సారోని, మడగల జానకీరామ్‌లకు కేజీహెచ్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటనలో జె.నాగరాజు 90 శాతం మేర కాలిపోయారని, ఆయనకు సీఎస్ఆర్ బ్లాక్‌లో ప్రత్యేక వార్డులో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గోవిందు 30 శాతం మేర, జానకీరామ్ 50 శాతం మేర కాలిపోయారని చెప్పారు.



సెలైన్ బాటిల్‌తో వేలంగి సారోని

వేలంగి సారోనికి కాలికి గాయం కావడంతో కేజీహెచ్‌లో అర్థోపెడిక్ వార్డులో చికిత్స అందిస్తున్నామన్నారు. వేలంగి సంతోషికి కొద్దిపాటి గాయాలు కావడంతో వైద్య సేవలు అందించామన్నారు.

ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలు చెల్లించాలి

ఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రులు బూడి, అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు జోగులు, ధర్మశ్రీ, గణేష్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి, మాజీ విప్ ధర్మశ్రీ, మాజీ మంత్రి అమర్‌నాథ్

సాక్షి, అనకాపల్లి: కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు డిమాండ్ చేశారు. తొలుత బాణసంచా అగ్నిప్రమాద సమాచారం తెలుసుకున్న కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు ఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యల్లో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం మాజీ మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్సనందించాలని అధికారులను కోరారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... ఈ ఘటన పట్ల మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. వారి కుటుంబాల్లో మనోధైర్యం నింపేందుకు కృషి చేయాలని తమను ఆదేశించారన్నారు. ఘటనపై తమ అధినేత దృష్టికి తీసుకెళ్లి బాధితులకు పార్టీ తరఫున సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులకు అప్పటి సీఎం జగన్ అండగా నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేమాదిరిగా ప్రస్తుతం ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా తక్షణమే అందించాలన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించడంతోపాటు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులు జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతూ కూలీ పనులు చేసుకోలేని పరిస్థితుల్లో ఉంటారన్నారు. వీరికి ప్రభుత్వం రూ.10 లక్షల వరకూ సాయమందిస్తే వారి కుటుంబాలకు భరోసా కల్పించినట్లుగా ఉంటుందని ఈ సందర్భంగా చెప్పారు.

భద్రతా తనిఖీలు నిర్వహించాలి...

భారీ పరిశ్రమల్లో చేస్తున్న మాదిరిగా గ్రామాల్లోని కుటీర పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వానికి మాజీ మంత్రులు సూచించారు. పదేళ్ల క్రితం బాణసంచా ప్రమాదం జరిగిందని, మళ్లీ ఘటన పునరావృతం కావడంతో దృష్టి పెట్టి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, కైలాసపట్నం సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, మాజీ జెడ్పీటీసీ వంతర వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కదిలిస్తే కన్నీళ్లు



ఎస్.రాయవరం: ప్రమాద తీవ్రత అదుపులోనికి వచ్చిన తరువాత కూడా రెండు గంటల పాటు నక్కపల్లి, నర్సీపట్నం, మాకవరపాలెం ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలాన్ని తడుపుతూ నిప్పురవ్వలు చెలరేగకుండా చేశారు. ధాన్యపు పొట్టుకు అంటుకున్న మంటలు ఆరకపోవడంతో మరో ఫైరింజన్‌తో మంటలు ఆర్పారు.

- సోమ, మంగళవారాల్లో కోటవురట్ల మండలం పందూరు, చౌడువాడ, యలమంచిలి మండలం పురుషోత్తపురం, రేగుపాలెం, కొత్తలి గ్రామాల్లో గ్రామ దేవతల పండగలు ఉండడంతో మందుగుండుకు ఆర్డర్లు వచ్చాయి. దీంతో ఆదివారం కూడా సామగ్రి తయారు చేశారు.
- మందుగుండు కేంద్రం వద్ద పెంచుతున్న నాటు కోళ్లు కూడా 100కుపైగా దహనమయ్యాయి.



ఆనవాళ్లు లేకుండాపోయిన బాణసంచా కేంద్రం

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

COMMERCIAL SPACE FOR SALE

■ Industrial Property for sale : 5000 Sq.Yds. with Industrial Shed & Building per Sq.Yard. Rs. 30,000/- at APIIC Auto Nagar, Near D Mart, A to Z Real Estate. Cont : 99598 65968, 93924 68007 [V- 6892]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

Wanted

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 15వేలు ఆపైన సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [G-83]

■ వైజాగ్‌లో శుభగృహ నందు పనిచేయుటకు యువకులు కావలెను. Q : 10th to Any Degree or PG, Age : 21 to 35, Salary : Rs. 12K to 22K + Incentives కలవు. ఫోన్ : 95534 27362 [V- 12421]

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు టెలీకాలర్స్ (F) కావలెను. గృహిణులకు ప్రాధాన్యత ఇవ్వబడును. అర్హత : ఇంటర్ / డిగ్రీ. ఆకర్షణీయమైన జీతం. శ్రావణి : 99491 29054, 88856 47425 [V- 2140]

■ మా డాన్‌బోస్కో సంస్థ, సబ్బవరం నందు స్కిల్ ట్రైనింగ్ ప్రోగామ్ కొరకు ఈ క్రింది స్టాఫ్ కావలెను. 1. ట్రైనర్- హాస్పిటాలిటీ, 2) ట్రైనర్- సోలార్ PV ఇన్స్టాలర్, 3) ట్రైనర్- టెలికాం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ రిపేర్ సెంటర్, 4) మొబిలైజర్, 5) సెంటర్ మేనేజర్. Ph: 98486 55134 [G-85]

■ Wanted Male Non Teaching Staff Qualification Any Degree/P.G, Age Limit: 25 to 45 years, Salary 10000/- to 22000/- Working Location: Master Minds College, Vizag & Gajuwaka. Contact: 9248733325, 8008556073 [G-5931]

■ కిసాన్ మిత్రలో NLM స్కీమ్ క్రింద రిలేషన్‌షిప్ మేనేజర్స్, DMలు కావలెను. జీతం: మేనేజర్స్‌కి 25 వేలు, DM లకి 35 వేలు. అర్హత: 10th to డిగ్రీ వరకు. సంప్ర।। 9392282701, 9000501816, 8341890291. [A-1568]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను, పేషేంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీతం: 18k Ph: 9640648899, 9640528899 [HA-1907]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

జిల్లా స్థాయి బైరో భజన పోటీల విజేత అగనంపూడి

మాడుగుల రూరల్: జిల్లా స్థాయి బైరో భజన పోటీల విజేతగా అగనంపూడి నిలిచింది. మండలంలో కె.జె.పురంలో బాలాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలు శనివారం రాత్రి 12 గంటల వరకు నిర్వహించారు. విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి 12 భజన బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సప్తస్వరాలు భజన బృందం(అగనంపూడి) రూ.8 వేలు, వీరాంజనేయ బృందం(జాకీరు) రూ.5 వేలు, కుసుమ హరినాథ బృందం (కె.జె.పురం) నిలిచాయి. తర్వాత వరుస స్థానాల్లో రామలింగేశ్వర భజన బృందం (బంగారమ్మపాలెం), అభయాంజనేయ స్వామి భజన బృందం (వరహాపురం), వెంకటేశ్వర భజన బృందం (ఒమ్మలి), శ్రీరామ భజన బృందం (ఎల్. కోట), శ్రీరామ భజన బృందం (బి.సింగవరం)లకు రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.1000, రూ.800 చొప్పున బహుమతులు ప్రదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.

థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో బాలికల ప్రతిభ




ఏపీ టీం సభ్యులతో అల్లూరి జిల్లా కోచ్‌లు కొండబాబు, సూరిబాబు, భూపతిరాజు, కమలకుమారి

పాడేరు: మణిపూర్ రాష్ట్రం ఇంపాల్‌లో జరుగుతున్న 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ చాంపియన్ షిప్‌లో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపారు. మణిపూర్ రాష్ట్రం ఇంపాల్‌లో ఈనెల 7నుంచి 12 వరకు థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు జరిగాయి. అండర్–19 బాలికల కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 62 కేజీల విభాగంలో విజయవాడకు చెందిన భానుప్రియ, 70 కేజీల విభాగంలో అనకాపల్లికి చెందిన పి.దుర్గ కాంస్య పతకాలు సాధించారు. వీరికి అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వండల కొండబాబు, ఫిజికల్ డైరెక్టర్లు పాంగి సూరిబాబు, మత్స్యరాస భూపతిరాజు, కమలకుమారి కోచ్‌లుగా వ్యవహరించారు.

ఊపిరి తీసిన విద్యుత్ తీగలు

విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి కూలీ మృతి



మృతుడు బూసాల శంకరరావు

మునగపాక: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో విద్యుత్ పనులు నిర్వహించే కూలీ మృత్యువాతకు గురైన సంఘటన మునగపాకలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం దండిసురవరం గ్రామానికి చెందిన బూసాల శంకరరావు(33)కు అయిదు సంవత్సరాల క్రితం వివాహమైంది. అతడు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మునగపాకలో ఈ నెల 12వ తేదీన సంభవించిన గాలివాన కారణంగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. కాంట్రాక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా స్తంభంపై పనులు చేపడుతున్నాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు తాకడంతో శంకరరావు కింద పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి 108 వాహనంలో తరలించేలోపు మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు శంకరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహాత్మునికి ఆర్టీసీ ఉద్యోగుల వినతి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా కార్యదర్శి సుధాకర్, ఉద్యోగులు

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఇచ్చిన సర్క్యులర్ నంబర్ 1/2019ను దిగువ స్థాయి అధికారులు అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో చర్యలు చేపట్టం లేదని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 రోజులుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్, బదిలీలు నిలుపుదల చేయాలన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు లేని విధంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఇస్తున్న తీవ్రమైన పనిష్మెంట్లను రద్దు చేయాలన్నారు. అక్రమ కేసులు రాస్తున్న తనిఖీ అధికారులపై చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఏఎన్ రావు, కార్యదర్శి కేఎన్‌వీ రమేష్, కోశాధికారి ఎంబీ రాజు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్ ఏర్పాటు చేయాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న గిరిజనులు

రావికమతం: గిరిజన సమస్యలపై నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక గిరిజన దర్బార్ ఏర్పాటు చేయాలని కోరుతూ రావికమతం మండలం గిరిజనులు జెడ్.బెన్నవరం నుంచి అజేయపురం వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కల్యాణపులోవ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగంలో గిరిజనుల రక్షణకు అనేక చట్టాలు రూపొందించారన్నారు. వీటిని నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు పాలకులు వర్తింపజేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం భూ సమస్యపై ప్రత్యేక గిరిజన దర్బార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు కే గోవిందరావు, పీవీటీజీ గిరిజన సంఘం నాయకులు గేమిల వాసు, గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..



పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

నక్కపల్లి: పరిమితికి మించి అధిక లోడుతో వెళ్తున్న రెండు ఇసుక లారీలను నక్కపల్లి సీఐ కుమారస్వామి పట్టుకున్నారు. పరిమితికి మించి అధిక లోడుతో బండరాళ్లు, ఇసుక, ఫ్లైయాష్ లోడింగ్ చేసి అడ్డదారిలో రవాణా చేస్తున్నారంటూ ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. వేంపాడు, తమ్మయ్యపేట మీదుగా అడ్డదారిలో అనకాపల్లి వైపు వెళ్తున్న అధిక లోడు లారీలను వేంపాడు వద్ద పట్టుకున్నట్లు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధించేందుకు సిఫార్సు చేశామన్నారు. పట్టుబడిన లారీలు సాధారణ సామర్థ్యం కంటే ఎక్కువ బరువుతో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. కాగా సాక్షిలో కథనం రావడంతో రాజమహేంద్రవరం నుంచి రాంబిల్లి బండరాళ్లతో వెళ్తున్న లారీలు అడ్డదారిలో కాకుండా జాతీయ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. అధిక లోడు వేసినట్లు అనుమానం వస్తే టోల్ ప్లాజాల వద్ద ఏర్పాటు చేసిన వే బ్రిడ్జిల వద్ద బరువు చెక్ చేయాల్సి ఉంది. అయితే సోమవారం సుమారు 70 నుంచి 80 వరకు లారీలు బండరాళ్ల లోడుతో వెళ్లినప్పటికీ తనిఖీలు చేయకుండానే టోల్ ప్లాజా సిబ్బంది విడిచిపెట్టడం గమనార్హం. ఈ లారీలన్నీ 80 టన్నుల కంటే ఎక్కువ బరువుతోనే రాకపోకలు సాగిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి అభినందన



వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండలరావును సన్మానిస్తున్న బూడి

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన శానాపతి కొండలరావును పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శాలువా కప్పి సన్మానించారు. ఆదివారం దేవరాపల్లి మండలం తారువలో బూడిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు.

ఇంటర్లో కేజీబీవీ విద్యార్థినుల ఉత్తమ ఫలితాలు

అనకాపల్లి టౌన్: జిల్లా కేజీబీవీల్లో 2025 విద్యా సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 629 మంది పరీక్షలు రాయగా, 86 శాతంతో 543 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 572 మందికిగాను 91 శాతంతో 520 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో 50 మంది విద్యార్థినులు 900 మార్కులు పైగా సాధించారని తెలిపారు. గతేడాదితో పోలిస్తే 11 శాతం మెరుగైన ఫలితాలు సాధించారన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాజులమ్మకు ప్రథమం..

కశింకోట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థిని కె. రాజులమ్మ ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 983 మార్కులతో రాష్ట్రంలోని కేజీబీవీలో మొదటి స్థానం సాధించిందన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి లోకేష్ సన్‌షైన్ స్టార్స్ అవార్డును ఆమెకు అందజేస్తారని తెలిపారు.

సార్థకనామధేయుడు 'వనజీవి'



వనజీవి రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ క్లబ్ చేపడుతున్న సేవలు అభినందనీయమని పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నారాయణరావు అన్నారు. పట్టణంలోని గవరపాలెం పార్కు సెంటర్‌లో ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో మూగజీవాలకు గూళ్ళు, ధాన్యం కుంచెలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ ఇంటి పేరునే వనజీవిగా మార్చుకొని మొక్కలు నాటడంలో దేశంలోనే సరికొత్త రికార్డును సృష్టించి 2015లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్న గొప్ప నేత అని కొనియాడారు. వేసవిలో పక్షులకు నీరు దొరకడం కష్టంగా ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు పక్షులకు నీరు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, కర్రి సన్యాసినాయుడు, పెంటకోట సురేష్, యల్లపు సంతోష్ కుమార్, అధిక సంఖ్యలో గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు


క్రేన్ సహాయంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

అనకాపల్లి టౌన్: విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. శనివారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు పడిపోయిన సంగతి తెలిసిందే. పలు చోట్ల స్తంభాలు నేల కొరిగి చాలా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రి అంతా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఏడీ రామ రెడ్డి, ఏఈ త్రినాథరావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ పునరుద్ధరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి నేడు

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ తెలిపారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం 80వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

నేడు రక్తదాన శిబిరం

కశింకోట: కశింకోటలోని సంతబయల ఎస్సీ కాలనీ వద్ద ఉన్న రామాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ రవ్వా రమేష్ తెలిపారు. నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ ఎస్ఐ సంతోష్, తదితరులు

అనకాపల్లి: త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌ను స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఎస్ఐ సంతోష్, తదితరులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాల సూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థమయ్యేలా ఈ క్యాలెండర్ ఉందన్నారు. తెలుగు నెలలు అనుసరించేలా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి తయారు చేసిన ఈ క్యాలెండర్ ప్రతి ఇంట్లో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రమణ అక్షయ్, కుమార్, నాగమణి, పద్మ, సత్యవతి, కన్య, మీనాక్షి, దేవి, ఈ తదితరులు పాల్గొన్నారు.

26న హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యుడు డి.డి.నాయుడు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

అనకాపల్లి: పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి వరకూ ఈ నెల 26న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, వైద్యుడు డి.డి.నాయుడు తెలిపారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి ఆలయంలో హనుమాన్ శోభాయాత్ర పోస్టర్, విశ్వహిందూ పరిషత్ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభాయాత్రలో అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రాంత సత్సంగ్ ప్రముఖులు శ్రీకాళహస్తి,, డాక్టర్ దక్షిణామూర్తి, ఆర్ఎస్ఎస్ నగర సంఘం సంచాలకుడు విల్లూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి అరవెల్లి ప్రదీప్, నగర ఉపాధ్యక్షుడు కొలవర్తి కన్నబాబు, జిల్లా కోశాధికారి ఆడారి రాజు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ప్రజల కష్టాలు..!




చింతలపాలెంలో ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న రెండో రక్షిత మంచినీటి పథకం


రంగు మారిన బోరు నీరు సేకరణ

- చింతలపాలెంలో తాగునీటి ఎద్దడి
- నాలుగు నెలలుగా అందని నీరు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కశింకోట: వేసవి వచ్చిందంటే ఏటా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని చింతలపాలెంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. రెండు రక్షిత మంచినీటి పథకాలు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. ఒకటి మాత్రమే పని చేస్తుండటం, మరొకటి ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉండడంతో ప్రజల తాగునీటి అవసరాలు తీరడం లేదు. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని జాతీయ రహదారిని ఆనుకొని చింతలపాలెం గ్రామం ఉంది. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 624 ఇళ్లు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 200 ఇళ్లకు జల జీవన్ మిషన్ కింద రూ.37 లక్షలు వెచ్చించి పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటి కుళాయిలు ఇచ్చారు. వీటిలో 180 వరకు ప్రస్తుతం పని చేస్తున్నాయి. వీటితో పాటు 40 పబ్లిక్ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. 20 వరకు ఇంటింటి కుళాయిలకు నీరు రావడం లేదు. జాతీయ రహదారికి రెండో వైపు కుళాయిల నుంచి అసలు నీరు రాకపోవంతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు దాటి వెళ్లి తాగునీరు తెచ్చుకోవలసి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఉన్న రక్షిత మంచినీటి పథకం నుంచి కుళాయిలకు నీరు సరఫరా అవుతోంది. మరో రక్షిత మంచినీటి పథకాన్ని సమగ్ర భారీ రక్షిత మంచినీటి పథకంలో భాగంగా 40 వేల సామర్థ్యంతో ఏడేళ్ల క్రితం నిర్మించినప్పటికీ **ప్రాజెక్టు నుంచి** దానికి పైపులైన్ వేయలేదు. **దీంతో అది అప్పటి** నుంచి నిరుపయోగంగా ఉంది. **నాలుగు నెలలుగా ఇంటింటి** కుళాయిల నుంచి బిందెడు నీళ్లు కూడా రావడం లేదని, ప్రైవేటుగా నీరు కొనుగోలు చేయడం, లేదా బోర్ల నుంచి నీరు తోడి తెచ్చుకోవలసి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ నీరు కూడా రంగు మారి ఉంటోందని, గత్యంతరం లేక తాగాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బోరు ఏర్పాటు చేసి నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


ప్రస్తుతం నీరు సరఫరా అవుతున్న రక్షిత పథకం


జాతీయ రహదారి పక్కన నీరు రాని ఇంటింటి కుళాయి

అరకొరగా సరఫరా



కుళాయిల నుంచి అరకొరగా తాగునీరు వస్తోంది. పావు గంట కూడా రావడం లేదు. దీంతో దూరంగా వెళ్లి బోర్ల నుంచి నీరు తెచ్చుకోవలసి వస్తోంది. ఇప్పుడు వేసవి కావడంతో మరింత ఇబ్బందిగా ఉంది. కుళాయిల నుంచి తాగునీటి సరఫరాను మెరుగుపర్చి నీటి సమస్యను తీర్చాలి.
– ఆనాల చంద్రకళ, చింతలపాలెం

కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయాలి



కుళాయిలకు తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రమాదకరంగా ఉన్న జాతీయ రహదారిని దాటి గ్రామం వైపు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవలసి వస్తోంది. ఒక్కొక్కసారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీని దృష్ట్యా తమ ప్రాంతంలో కుళాయిల నుంచి తాగునీటిని సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
– పూడి లక్ష్మి, చింతలపాలెం

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చింతలపాలెం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారం పంచాయతీ తీర్మానం ఇవ్వాల్సి ఉంది. బోరు ఎక్కడ ఏర్పాటు చేయాలో తెలియజేయాల్సి ఉంది. తీర్మానం ఇచ్చిన తక్షణమే బోరు ఏర్పాటు చేసి రెండో రక్షిత పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం.
– కె.శ్రీనివాస్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కశింకోట

బోరు ఏర్పాటుకు తీర్మానం

బోరు ఏర్పాటుకు పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. సత్వరమే బోరు ఏర్పాటు చేసి రెండో రక్షిత పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
– కొట్టి రాము, సర్పంచ్ , చింతలపాలెం

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు


ఎన్టీఆర్ మైదానంలో కళాకారుల నృత్య ప్రదర్శన


అమ్మవారికి కోళ్లను మొక్కుతున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత తాగునీరు, మజ్జిగ, అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీనులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు టివి.విజయకుమార్. ఎం.వెంకటనారాయణలు గట్టిపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, భగవత్‌గీత ఖ్యాతి ప్రవచనకర్తలు డాక్టర్ సంతోష్‌కుమార్, ఆమెగ్‌దేశ్‌పతి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఆధ్యాత్మిక సమావేశం

అనకాపల్లి టౌన్: శాశ్వతమైన, అఖండమైన ధర్మమే సనాతన ధర్మమని భగవద్గీత ఫౌండేషన్ అధినేత గంగాధర్ శాస్త్రి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఉత్సవాలలో భాగంగా సనాతన క్షాత్రం ఆధ్యాత్మిక సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మతం అంటే నిజాయితీ, సద్భావన, దయ, ఓపిక, ఇతరులను గౌరవించడమేనన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అతిథులు భగవద్గీత ఫౌండేషన్ అధినేత గంగాధర్ శాస్త్రి, రుగ్వేద అధ్యాపకుడు సంతోష్ కుమార్, ఆంధ్ర నాట్య కళాకారి టీఎస్ శుభ రాజేశ్వరీలను ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ఆధ్యాత్మిక సమావేశంలో పాల్గొన్న గంగాధర్ శాస్త్రి, తదితరులు


అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్లు వద్ద వంటలు చేసుకుంటున్న భక్తులు

తెలుకుల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గండేపల్లి వెంకట్రావు

అనకాపల్లి: అఖిల గాండ్ల తెలుకుల కులస్తులు సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి వెంకట్రావు అన్నారు. స్థానిక బాలాజీరావు సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా శాఖను బలోపేతం చేయడం కోసం జిల్లాలోని అన్ని మండలాల్లో తెలుకుల కులస్తులను సమీకరించి సమర్థులైన వారిని ఎంపిక చేసి జిల్లా శాఖలోకి తీసుకుంటామన్నారు. జిల్లాలో దాదాపు 20 వేల మంది తెలుకుల కులస్తులు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది ఉన్నట్లు చెప్పారు. బీసీ కులాల్లో అత్యంత వెనుకబాటు తనంతో మగ్గిపోతున్న ఈ కులస్తులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో తమ కులస్తులకు ఒక కల్యాణ మండపానికి అవసరమైన స్థలం, నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కొమ్మనాపల్లి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి వాసుదేవరావు, కోశాధికారి రాజపూడి కోటేశ్వరరావు, సంఘం గౌరవాధ్యక్షుడు ఇంజరపు జ్ఞానేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం


జెయింట్‌వీల్స్ వద్ద చిన్నారుల సందడి


ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో వెలసి ఉన్న హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) ఆదివారం ఘనంగా ముగిసింది. శని, ఆదివారాల్లో జరిగిన ఈ ఉత్సవానికి ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిశా, టాటా నగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఔలియా సమాధిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రార్థనలు చేశారు. రాత్రి దర్గా ప్రాంగణంలో జాగరణ చేశారు. రాత్రి నాగపూర్, ముంబైకి చెందిన బృందాలతో నిర్వహించిన ఖవ్వాలి ఉర్దూ పాటల పోటీ అలరించింది. ఈ సందర్భంగా జరిగిన తీర్థ మహోత్సవంలో పిల్లలు, పెద్దలు ఆకాశ చక్రం, రంగుల రాట్నంపై సందడి చేశారు. ఫోం జారుడు బల్లలపై పిల్లలు జారుతూ ఆనందంగా చిందులేశారు. ముస్లింలతోపాటు హిందువులు ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పుష్పాంజలి సేవ


పుష్పాంజలి సేవ అనంతరం స్వామికి నివేదించిన పిండి వంటలు, పండ్లు

కశింకోట: స్థానిక పురాతన వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పుష్పాంజలి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చైత్ర శుద్ధ ఏకాదశి రోజు స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నిర్వహించిన పుష్పాంజలి సేవలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అందంగా మల్లె పూలు, సంపంగి, కనకకాంబరాలు, చామంతి, గులాబీ పూల మాలలతో అలంకరించారు. పాలు, వివిధ రకాల తీపి, కారం పిండి వంటలు, పండ్లు స్వామికి నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో ఈ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా తలుపులమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం


నేలవేషాలు

యలమంచిలి రూరల్: మండలంలోని షేకిళ్ల పాలెం శివారులో కొలువైన తలుపులమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తొలిరోజు గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం ఉదయం 8.24 గంటలకు ఆలయ ప్రారంభోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా చిడతల భజనలు, నేలవేషాలు, కోలాట ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


కోలాట ప్రదర్శన

ఘనంగా ప్రారంభమైన శ్రీరామరక్ష రథయాత్ర


ఉమ్మలాడలో శ్రీరామరక్ష రథయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. అయోధ్య రామాలయంలో బాలరాముడిని ప్రతిష్ఠించి ఏడాది కావచ్చిన సందర్భంగా ఉమ్మలాడ, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక గ్రామాల్లో రథయాత్ర నిర్వహించారు. ఈ యాత్రను పొందూరు ఆనందాశ్రయ స్వామీజీ శ్రీనివాసానంద సరస్వతి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవాటు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 20 రోజుల పాటు రథయాత్ర జరుగుతుందన్నారు. ప్రజల్లో భక్తిభావాలను నింపేందుకు ఇటువంటి రథయాత్రలు దోహదం చేస్తాయన్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఘనంగా మట్టల ఆదివారం


అంజయ్య కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


కశింకోటలోని గవరపేటలో ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తుమ్మపాల: పట్టణంలో గాంధీనగరం అంజయ్య కాలనీలో ఏసు కరుణ ప్రార్థన మందిరంలో క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను ఘనంగా జరుపుకొన్నారు. చర్చి సభ్యులతో పాటు స్థానిక మహిళలు హోసన్నా జయం జయం నినాదాలతో ఈత మట్టలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ డేవిడ్ మాట్లాడుతూ ఏసు రాజుగా వస్తున్నారని ప్రకటిస్తున్నామని తెలిపారు. సమాజ శాంతికి ఏసు ఎల్లప్పుడూ మనకు తోడుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో క్రైస్తవులు మట్టల ఆదివారం నిర్వహించారు. స్థానిక గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం నుంచి ఈత మట్టలను అందంగా పూలతో అలంకరించి క్రైస్తవులు వీధుల్లో ప్రదర్శన జరిపారు. ఆంధ్ర కల్వరీ బాప్టిస్టు చర్చి, షాలెం మందిరం నుంచి కూడా క్రైస్తవులు మట్టల ఆదివారం నిర్వహించి ర్యాలీలు నిర్వహించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com